# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఉద్యోగ మేళాలను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

**2. తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ రోజు ఢిల్లీలో పర్యటించనున్నారు**

**3. ఆంధ్రప్రదేశ్ లో జనవరి నుంచి పేదలకు 25లక్షల వరకు వైద్య బీమా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**

**4. ప్రభుత్వ వైద్య రంగంలో సేవలందించేందుకు యువత ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.**

**5. నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను త్వరలో పునరుద్ధరిస్తామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు.**

===========================

ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఉద్యోగ మేళాలను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఏలూరు జిల్లాలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం ప్రజావేదిక వద్ద జరిగిన సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు.

వాయిస్..30 సెకన్లు

-------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ రోజు ఢిల్లీలో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'కు ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో పలువురు కేంద్ర మంత్రులతోపాటు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీలను కూడా ముఖ్యమంత్రి ఆహ్వానించనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఈ ఉదయం 10 గంటలకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ-పిసిసి కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారని ఆ పార్టీ ఒక ప్రకటనలో

వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ మంత్రులు నారా లోకేశ్, వి.అనిత ఢిల్లీలో పర్యటిస్తున్నారు. నిన్న రాత్రి ఢిల్లీకి చేరుకున్న మంత్రులకు తెలుగు దేశం పార్టీ పార్లమెంటు సభ్యులు. స్వాగతం పలికారు. మంత్రులు లోకేశ్, అనిత ఈ రోజు కేంద్రమంత్రులు అమిత్ షా, శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలవనున్నారు. పార్లమెంట్‌లో వారితో సమావేశమై ఆంధ్రప్రదేశ్ లో మొంథా తుఫాను కారణంగా జరిగిన నష్టంపై వివరించనున్నారు. అలాగే పత్తి, మొక్కజొన్న, అరటి ధరలు తగ్గడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను కేంద్ర వ్యవసాయ మంత్రికి వివరించి ఆదుకోవాలని కోరనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జనవరి నుంచి పేదలకు 25లక్షల వరకు వైద్య బీమా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల్ని లబ్ధిదారులకు మంత్రి నిన్న అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య సహాయం అవసరమైన వారికి ఆర్థిక చేయూతని అందించేందుకు సహాయ నిధి ఉపయోగపడుతుందని తెలిపారు. కోటబొమ్మాళి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2 కోట్ల రూపాయల సాయాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందించినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు.

---------------------------

ప్రభుత్వ వైద్య రంగంలోకి సేవలందించేందుకు యువత ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖా మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ కోరారు. కృష్ణా జిల్లా చిన అవుటపల్లిలోని ఒక కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో వైద్య వృత్తికి గౌరవం, ప్రాధాన్యత ఉందన్నారు. వైద్య విద్యనభ్యసించిన విద్యార్థులు అంకిత భావంతో రోగులకు సేవలు అందించాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్యనందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శ్రేణులకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో మంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్...27 సెకన్లు

---------------------------

కళాకారులు, సాంకేతిక నిపుణులను గౌరవించేందుకు నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను త్వరలో పునరుద్ధరిస్తామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. ముంబయిలో జరుగుతున్న –సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్–2025–లో మంత్రి నిన్న పాల్గొని చలనచిత్ర, పర్యాటక రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ను

దేశంలోనే సినిమా షూటింగ్‌లకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా మారుస్తామని స్పష్టం చేశారు. ప్రొడక్షన్ నుండి ప్రదర్శన వరకు పరిశ్రమను బలోపేతం చేసేందుకు సమగ్రమైన కొత్త 'ఫిల్మ్ టూరిజం పాలసీ'ని త్వరలో ఆవిష్కరిస్తామని తెలిపారు. బీచ్‌ల నుండి నదుల వరకు, తీర్థయాత్రల నుండి హిల్ స్టేషన్ల వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహజ సౌందర్యం, సాంస్కృతిక వారసత్వాలకు అద్భుతమైన ప్రాంతమని వివరించారు.

---------------------------

ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ మేడారం అభివృద్ధి పనులను చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులును ఆదేశించారు. మేడారం అభివృద్ధి పనులపై హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రహదారులు, విద్యుత్తు స్తంభాల ఏర్పాటు, గద్దెల చుట్టూ దారులు, భక్తులు వేచి చూసే ప్రదేశాలు తదితర అంశాలకు సంబంధించిన పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. నిర్దేశిత సమయంలోనే పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలన దినంగా ఈరోజు పాటిస్తున్నాం. బానిసత్వాన్ని నిషేధించి రెండు శతాబ్దాలైనప్పటికీ... కొత్త రూపాలలో ఇంకా కొనసాగుతోంది. 1949 డిసెంబర్ 2వ తేదీన మానవ అక్రమ రవాణాపై ఐక్యరాజ్య సమితి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అప్పటినుంచి డిసెంబర్ 2వ తేదిని అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలన దినంగా ప్రకటించారు. వెట్టిచాకిరి, బాలకార్మికులు, అక్రమ రవాణాల రూపంలో ఇంకా బానిసత్వం కొనసాగుతున్న విషయాన్ని అందరికీ తెలియజేసి.. దీనిని నిర్మూలించేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఈ సదర్భంగా పలు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాయి.

---------------------------

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా ఆంధ్ర తీరాలకు సమీపంలో కొనసాగుతోందని ఇది ఉత్తర దిశగా కదులుతూ. ఈరోజు ఉదయంలోగా వాయుగుండంగా బలహీన పడుతుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎం. వెంకట్రావ్ తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని దక్షిణ, తూర్పు ప్రాంత జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ ప్రాంత జిల్లాల్లోని కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు, ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి పరిధిలోని ఆలయాల్లోనూ తిరుమల తరహాలో భక్తులకు అన్న ప్రసాదాలు అందించాలని టిటిడి కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. టిటిడి పరిధిలోని ఆలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఈవో తిరుమలలో నిన్న సమీక్ష నిర్వహించారు.

======================